క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో చండీ సప్తశతి మహాయాగం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పెద్ద వాగు నదీ తీరాన గల శ్రీ బాలేశ్వరస్వామి లోయలో ఈనెల 16వ తేదీన నిర్వహించే రథోత్సవాన్ని పురస్కరించుకొని నవరాత్రుల్లో భాగంగా నాల్గవ రోజు మంగళవారం ఆలయ అర్చకులు శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో శ్రీ చండీ సప్తశతి మహాయాగం నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి అభిషేకం, రాజోపచార ములు, మంగళహారతి, మహా మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు విజయ్‌కుమార్ శర్మ, అజయ్ శర్మ, బాలేశ్వర్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు

కెరమెరి: వేటగాళ్లు పంట పొలాల్లో విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై గుంపుల విజయ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దొంగతనంగా విద్యుత్ తీగలు అమర్చడం వల్ల అటవీ జంతువులతో పాటు అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు.

తిర్యాణి: పంట పొలాల రక్షణకు, అటవీ జంతువులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తప్పవని సీఐ చిట్టిబాబు అన్నారు. మంగళవారం మండలంలోని బుగ్గ రామన్న గూడెంలో ఆదివాసీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై చుంచు రమేశ్ తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ కమిటీ ఎన్నిక

బెజ్జూర్: మండల కేంద్రంలో అంబేద్కర్ భవనం ఎదుట అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కోసం మంగళవారం అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ మండల కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జాడి దిగంబర్, సిడాం సకారాం, అధ్యక్షుడిగా దుర్గం శంకర్, ఉపాధ్యక్షుడిగా సామల తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా దుర్గం దేవాజి, కార్యదర్శిగా కొండా రాంప్రసాద్, కోశాధికారిగా కుమ్మరి తిరుపతి, సలహాదారులుగా జావీద్ అలీఖాన్, ప్రచార కార్యదర్శిగా డోంగ్రె చిత్రుతో పాటు మరో 20 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చూడాలి

దహెగాం: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాజేశ్వర్ గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పల్లెప్రగతి పనులు కొనసాగించాలన్నారు. నర్సరీల్లో మొక్కలు పెంచాలన్నారు. వేసవి కాలం వచ్చినందున తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఈజీఎస్ ఏపీవో కల్పన, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం స్కీం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

దహెగాం: నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పని చేస్తున్న అన్ని క్యాడర్ల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఎన్‌హెచ్‌ఎం స్కీం జిల్లా ప్రధాన కార్యదర్శి మధుకర్ అన్నారు. మంగళవారం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో కలిసి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసును స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందజేశారు. ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది జ్యోతి, సత్యవాణి, లక్ష్మి, శాంత, అనిత, బేబి తదితరులు పాల్గొన్నారు.

సైకిల్‌పై అయోధ్యకు చేరిన రామభక్తుడు



అయోధ్యలో రామభక్తుడు ఆత్రం సచిన్

ఆసిఫాబాద్‌అర్బన్: అయోధ్యలో బాల రాముడి దర్శనానికి జనవరి 22వ తేదీన జిల్లా నుంచి సైకిల్‌పై బయలుదేరిన రామ భక్తుడు ఆత్రం సచిన్ మంగళవారం అయోధ్య చేరుకున్నారు. తిర్యాణి మండలం ఎదులపహాడ్ గ్రామానికి చెందిన భక్తుడు ఆత్రం సచిన్ తన గ్రామం నుంచి అయోధ్యకు సైకిల్‌పై వెళ్లాడు. మొత్తం 1,020 కి.మీ ప్రయాణాన్ని 22 రోజుల్లో పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

జాతర ఏర్పాట్లు పరిశీలన

రెబ్బెన: గంగాపూర్‌లోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 22 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న జాతర సందర్భంగా ఆలయ పరిసరాల్లో చేపట్టిన ఏర్పాట్లను మంగళవారం ఎస్సై చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. జాతరలో అత్యంత ప్రాధాన్యత కలిగిన స్వామివారి రథోత్సవం నిర్వహించే ప్రాంతంలో చేపట్టనున్న ఏర్పాట్లపై చర్చించారు.

నిలిచిన 'ఎత్తిపోతలు'

- రూ.37 కోట్లతో కోర్సిని ఎత్తిపోతల పథకం నిర్మాణం
- రైతు అనుమతి లేకుండా భూసేకరణ..!
- ఇప్పటికీ పరిహారం అందకపోవడంతో సాగునీటి సరఫరా అడ్డగింత
- పంటలు ఎండిపోతున్నా పట్టించుకోని అధికారులు



కోర్సిని ఎత్తిపోతల పథకం



ఎత్తిపోతల పథకంలో అమర్చిన మోటార్లు

చింతలమానెపల్లి: కోర్సిని ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీరు సరఫరా కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కోర్సిని గ్రామం వద్ద ప్రాణహిత నదిపై ఎత్తిపోతల పథకం పనులను 2014లో ప్రారంభించారు. 4వేల ఎకరాల సాగు లక్ష్యంతో రూ. 30కోట్ల అంచనా వ్యయంతో దీన్ని నిర్మించారు. ఈ ఎత్తిపోతల ద్వారా కోర్సిని సమీప గ్రామాలు గంగాపూర్, రవీంద్రనగర్, బాబాపూర్, బాలాజీ అనుకోడ గ్రామాల రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.

ఆలస్యంగానే పూర్తి..

కోర్సిని ఎత్తిపోతల పథకం ఒప్పందం ప్రకారం 2016లో పూర్తి కావాలి. నిర్మాణంలో భాగంగా పైపులైన్, జాక్‌వెల్, ఇంటెక్‌వెల్, ఇంటెక్ పైప్‌లైన్, విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రధాన పైపులైన్ నిర్మాణం సైతం పూర్తయింది. పైపులైన్ అనుసంధానంగా రైతుల భూముల వద్దకు నిర్మించే పైపులైన్ల నిర్మాణ పనులు పెండింగ్‌లు ఉన్నాయి. నీటిని నది నుంచి ఎత్తి పోసేందుకు 200 హెచ్‌పీ మోటార్లు రెండు, 430 హెచ్‌పీ మోటార్లు మూడు అమర్చారు. వీటికి సంబంధించిన పనులు పూర్తయ్యాయి. గతంలో పలు అనుమతులు రాక పనులు ఆలస్యంగా పూర్తయినట్లు అధికారులు తెలిపారు. గత ఏడాది రైతులు ప్రధాన పైపులైన్ నుంచి నీటిని సరఫరా చేసి స్థానికంగా ఉన్న కాలువలో నీటిని నింపుకొని వినియోగించుకున్నారు. మోటార్ల ద్వారా కాలువ నుంచి నీటిని తోడుకుని పంట భూములకు సరఫరా చేసుకున్నారు. భూముల వద్దకు పైపులైన్ల నిర్మాణం పూర్తయితే 3వేల ఎకరాలకు పైగా భూమిలో రెండు పంటలు పండించే అవకాశం ఉంది.

సరఫరా అడ్డుకుంటున్న రైతు..

కోర్సిని ఎత్తిపోతల పథకం నుంచి గత ఏడాది నీటిని సరఫరా చేశారు. దీంతో ఈ ఏడాది రైతులు ఎత్తిపోతల పథకం నీటిపై ఆశలు పెట్టుకున్నారు. మొక్కజొన్న, మిరప, కూరగాయల పంటలు సాగు చేస్తున్న రైతులు నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భాగంగా నష్టపరిహారం రాని రైతు నీటిసరఫరాను అడ్డుకోవడంతో ఎత్తిపోతల నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. సమస్య పరిష్కరించాల్సిన నీటిపారుదల శాఖ అధికారులు, గుత్తేదారు స్పందించకపోవడంతో రైతుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. పథకం పూర్తయినా నీటి సరఫరా చేయకపోవడంతో ఎత్తిపోతల పథకం వద్ద కాపలా ఉన్న సిబ్బందిపై రైతులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. సిబ్బంది రైతులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. అధికారుల తీరు కారణంగానే ఎత్తిపోతల నుంచి నీరు సరఫరా కావడం లేదని, రైతుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి రైతుకు నష్ట పరిహారం చెల్లించి, ఎత్తి పోతల పథకం నుంచి నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నాకు న్యాయం చేయాలి



నాకు కోర్సిని గ్రామ శివారులోని 41/5 సర్వే నంబర్‌లో నా తండ్రి కొడిపె దేశి నుంచి వారసత్వంగా వచ్చిన నాలుగెకరాల భూమి ఉంది. 2014లో ఉపాధి కోసం ఊరు విడిచి వెళ్లినప్పుడు నా అనుమతి లేకుండా రెండెకరాల భూమిలో ఎత్తిపోతల పథకం నిర్మించారు. అప్పుడు దీని గురించి అవగాహన లేదు. అధికారులను అడిగితే నష్టపరిహారం ఇస్తామన్నారు. రెండెకరాలతో పాటు ఎత్తిపోతల పథకం పనులతో మరో ఎకరం భూమి వ్యవసాయానికి పనికి రాకుండా పోయింది. ఇప్పటికీ నష్టపరిహారం చెల్లించలేదు. పదేళ్లుగా పంట సాగు చేయడం లేదు. పది సంవత్సరాలకు పంట నష్టపరిహారం, భూమికి పరిహారం ఇవ్వాలి. వ్యవసాయానికి పనికి రాకుండా పోయిన భూమి అభివృద్ధికి సైతం పరిహారం ఇచ్చి ప్రభుత్వం నాకు న్యాయం చేయాలి. పూర్తి స్థాయిలో నష్ట పరిహారం చెల్లిస్తేనే ఎత్తిపోతల పథకం నుంచి నీటిని సరఫరా చేయాలని అధికారులకు చెప్పా. అయినా వారు స్పందించడం లేదు.

– కొడిపె సంతోష్, కోర్సిని గ్రామం

అధికారులు చర్యలు తీసుకోవాలి



ఎత్తిపోతల పథకం కింద భూములు సాగు చేస్తున్నాం. మొక్క జొన్న పంట వేశాం. పంటకు ఇప్పుడు నీరందించాల్సిన అవసరం ఉంది. కాని అధికారులు మాత్రం స్పందించడం లేదు. ఎత్తిపోతల పథకం పని చేస్తున్నా అధికారులు స్పందించక పోవడంతోనే నిరుపయోగంగా మారింది.

– రైతు గంగారాం, గంగాపూర్

ముస్తాబైన సాయి మందిరం

- నేడు 24వ వార్షికోత్సవం



ఆలయంలో సాయినాథుడి మూల విరాట్టు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని షిర్డీ సాయి మందిరం 24వ వార్షికోత్సవం సందర్భంగా ముస్తాబైంది. ఆలయంలో నిత్యం ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలతో పాటు పర్వదినాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయంలో సాయినాథుడి మూల విరాట్టుతో పాటు ఈశాన్యంలో విఘ్నేశ్వరుడు, ఆగ్నేయంలో దత్తాత్రేయుడు, నందీశ్వరుడు కొలువై ఉన్నారు. ఆలయ నిర్మాణానికి 24, నవంబర్ 1997న పరమహంస పూలాజీ బాబా శంఖుస్థాపన చేయగా, 10, ఫిబ్రవరి, 2000లో పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా నృసింహ భారతి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. భక్తుల సహకారంతో కల్యాణ మండపం, ముఖద్వారం, అన్నదాన మండపం నిర్మించారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా..

షిర్డీ సాయి మందిరం జిల్లాలోనే ఒక ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. గత 24 సంవత్సరాలుగా ఆలయంలో ప్రతిరోజు రాత్రి సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, లక్ష్మి అష్టోత్తరాలు, రుద్రాష్టకం, శ్రీరామరక్షా స్తోత్రం, చంద్రషేఖరాష్టకం, శ్రీమద్భగవద్గీత పారాయణం నిరాటంకంగా సాగుతోంది. ఏటా గురుపౌర్ణమి సందర్భంగా సామూహిక సచ్చరిత్ర పారాయణం, సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తారు. ఏటా ఆలయ వార్షికోత్సవం, దసరా ఉత్సవాలు, దత్తజయంతి, గురుపౌర్ణమి, కో జాగిరి పౌర్ణమి, కృష్ణాష్టమి, శంకరజయంతి, గీతా జయంతి ఉత్సవాలు నిర్వహించడంతో పాటు ప్రతి నెలా చివరి గురువారం ఆలయంలో నారాయణసేవ(అన్నదానం) చేపడుతున్నారు. భక్తుల కోరిక మేరకు రామాయణ, మహాభారత, శ్రీ గురు చరిత్ర సప్తాహాలు నిర్వహిస్తారు. ప్రతీ గురువారం సాయంత్రం 6.30 గంటలకు పల్లకి సేవ నిర్వహిస్తారు. వార్షికోత్సవం పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.

నేటి కార్యక్రమాలు

వార్షికోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం 7 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, పంచగవ్యప్రాశన, నవగ్రహ వాస్తు యోగిని, క్షేత్ర పాలక, సర్వతోభద్ర మండల స్థాపన పూజ, హోమాలు, మధ్యాహ్నం 12 గంటలకు మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ, అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉదయం కాకడ హారతి, మంగళ స్నానం, దూపహారతి, మహామంత్ర పుష్పం, చతుర్వేద సేవలు, తీర్థ ప్రసాద వితరణతో పాటు రాత్రి శేజ హారతి నిర్వహిస్తున్నట్లు అర్చకులు మధూకర శర్మ తెలిపారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ సంతోష్

రెబ్బెన: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించిన విద్యార్థులకు విద్యా, ఉద్యోగావకాశాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీశ్, నంబాల మాజీ సర్పంచ్ సోమశేఖర్, కళాశాల క్రీడల ఇన్‌చార్జి శ్రీనివాస్, గంగాధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం



సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

ఆసిఫాబాద్‌అర్బన్: ఉద్యోగులకు బదిలీలు సహజమని ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు పేర్కొన్నారు. ఇటీవల ఆదిలాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లిన జెడ్పీ సీఈవో రత్నమాలను మంగళవారం జెడ్పీ కార్యాలయంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్‌తో కలిసి సన్మానించారు. జెడ్పీ కార్యాలయ సిబ్బంది తోటాజి, నాయకులు సత్యనారాయణ, మల్లేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో వైద్యులను నియమించాలి



మాట్లాడుతున్న కనక యాదవరావు

జైనూర్: గిరిజన ప్రాంత ప్రజలకు వైద్య సేవలందించేందుకు ప్రభుత్వాసుపత్రిలో సరిపడా వైద్యులను వెంటనే నియమించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్యాధికారులు స్పందించి వైద్యులను నియమించాలని, లేని పక్షంలో జిల్లా వైద్యాధికారి కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుమ్ర భగవంత్ రావు, మార్లవాయి సార్మేడి జుగ్నక దేవురావు, మహగాం సార్మేడి ఆత్రం ఆనంద్‌రావు, తదితరులు ఉన్నారు.

నేడు దేవతల విగ్రహాల ప్రతిష్టాపన

కెరమెరి: మండల కేంద్రంలో బుధవారం ఉదయం తుజాల్‌పురం మందిర సముదాయంలో దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఈ మేరకు ఆలయ నిర్మాణ దాత లక్ష్మి నారాయణగౌడ్, ప్రవీణ్ గౌడ్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దుర్గామాత, కోదండా రామచంద్రమూర్తి, శ్రీ కృష్ణ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. మంగళవారం వివిధ రకాల పూజా కార్యక్రమాలను మాడుగుల నారాయణ మూర్తి, పెండ్యాల గౌతమ్ శర్మ, గట్టుతా రామశర్మ నిర్వహించారు. నేడు మండపునశ్చరణ పూజా, గర్తారోధన, మూలవిరాట్టు ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, షోడశోపచార పూజ, మంగళ హారతి, మంత్ర పుష్పం, మహదాశ్వీదం, ప్రసాద వితరణ జరపనున్నట్లు ప్రవీణ్ గౌడ్ తెలిపారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



దుకాణం తనిఖీ చేస్తున్న రాజులనాయుడు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి, చేడ్వాయి గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను ఇన్‌చార్జి ఏడీఏ రాజులనాయుడు మంగళవారం తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కొనుగోలు విక్రయాలను రిజిస్టరులో విధిగా నమోదు చేయాలని సూచించారు. రైతులకు విక్రయాల్లో అక్రమాలకు పాల్పడితే షాపు లైసెన్సులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. వ్యాపారులు రైతులకు ఇచ్చే ఫర్టిలైజర్‌లను ఈపీవోఎస్ ద్వారా మాత్రమే అందజేయాలన్నారు. అనంతరం దుకాణాల్లో స్టాకులను పరిశీలించి వ్యాపారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏఈవో లావణ్య ఉన్నారు.

గత నెల రేషన్ ఇప్పించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న లింబాదాస్

కెరమెరి: ఆన్‌లైన్‌లో ఇబ్బందుల వల్ల గత నెలలో రేషన్ బియ్యం ఇవ్వలేదని, ప్రస్తుతం ఫిబ్రవరితో పాటు గత నెల రేషన్ బియ్యం కూడా ఇప్పించాలని ముకదంగూడ మాజీ సర్పంచ్ పతంగే లింబాదాస్ మంగళవారం కలెక్టర్ హేమంత్ బోర్కడేను కోరారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ ఇబ్బందుల వల్ల జనవరికి సంబంధించిన రేషన్ బియ్యం అందలేదని, ప్రస్తుతం గత నెల బియ్యం కోటా ఇవ్వకుండా ఫిబ్రవరికి సంబంధించిన బియ్యం పంపిణీ చేస్తున్నారన్నారు.

'కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉంటా'



మాట్లాడుతున్న సుగుణక్క

కెరమెరి: కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు బరిలో ఉంటానని, తనని ఆశీర్వదించాలని సుగుణక్క అన్నారు. మంగళవారం మండలంలోని ఝరి గ్రామంలో, నాయకులు, ఆదివాసీలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల సేవ కోసం తాను బరిలో ఉంటానన్నారు. పార్టీ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతోనే పర్యటిస్తున్నట్లు పేర్కొన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్‌అహ్మద్, నాయకులు ఆత్రం లక్ష్మణ్, న్యానేశ్వర్, సుజాయత్ ఖాన్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన పూర్వ విద్యార్థులు



పూర్వ విద్యార్థులతో ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: హైదరాబాద్‌లోని సురభి గ్రాండ్‌లో సోమవారం రాత్రి కాగజ్‌నగర్ పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఇందులో పూర్వ విద్యార్థి అయిన ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను పూర్వ విద్యార్థులు సన్మానించారు.

'సఖీ' సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సఖీ సిబ్బంది

పెంచికల్‌పేట్: మండలంలోని మురళీగూడ, జిల్లెడ, నందిగామ, కమ్మర్‌గాం, గుండెపల్లి, అగర్‌గూడ గ్రామాల్లో సఖీ కేంద్రం ద్వారా మహిళలకు అందించే వైద్యసేవలు, కౌన్సెలింగ్, పోలీసు సహాయం, న్యాయసహాయం, తాత్కాలిక సేవలపై కేంద్రం నిర్వాహకురాలు శ్రీనిధి మంగళవారం అవగాహన కల్పించారు. 181 మహిళా హెల్ప్‌లైన్ సంప్రదించే విధానంపై మహిళలకు వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

మట్కా ఆడుతున్న ఒకరి అరెస్టు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని చింతగూడ గ్రామంలో మట్కా ఆడుతున్న ఒకరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. సీఐ రాణాప్రతాప్, ఎస్సై సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో చింతగూడలో తనిఖీలు చేయగా, అబ్దుల్ మెహమూద్ వద్ద మట్కాకు సంబంధించిన చిట్టీలు లభ్యమయ్యాయి. అతని వద్ద నుంచి రూ.4320లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రవచన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం

కాగజ్‌నగర్‌రూరల్: భక్తి ప్రవచన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని నజ్రూల్‌నగర్‌లోని ఆర్యసమాజ్ వేద మందిర్‌లో మహాశ్రీ దయానంద్ సరస్వతి 200వ జయంతి సందర్భంగా ఆచార్య చంద్రేష్ ప్రవచన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాళీదాసు మజుందర, ఎంపీటీసీ వికాస్‌గరామి, మండల అధ్యక్షుడు రణవీర్‌బిశ్వాస్, జిల్లా అధికార ప్రతినిధి సమీర్‌గుప్తా, నాయకులు అమిత్ బిశ్వాస్, రాకేశ్ రాయ్, సమీర్‌దాస్ పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షల శిబిరానికి స్పందన

కౌటాల: జేఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జాన్వీ కేర్ ఆసుపత్రిలో మంగళవారం వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించగా స్పందన వచ్చింది. పరీక్షల అనంతరం 26 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకురాలు సీమ సర్కార్ తెలిపారు. ట్రస్టు చైర్మన్ నారాయణ్ సర్కార్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన ఎంపీడీవోగా శంకరమ్మ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీవో శంకరమ్మ

రెబ్బెన: రెబ్బెన మండల నూతన ఎంపీడీవోగా బదిలీపై వచ్చిన శంకరమ్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన శ్రీనివాస్ మంచిర్యాల జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో మంచిర్యాలకు చెందిన శంకరమ్మ వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, మండల పంచాయతీ కార్యదర్శులు నూతన ఎంపీడీవోకు శుభాకాంక్షలు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

రెబ్బెన: మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో పిల్లి కృష్ణ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 5.7 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ వరలక్ష్మి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్యాంలాల్‌లు తెలిపిన వివరాల ప్రకారం అందిన సమాచారం మేరకు ఎన్టీఆర్ కాలనీలో సోదాలు నిర్వహించగా పిల్లి కృష్ణ దళారులకు అమ్మేందుకు తన ఇంట్లో 11 ప్లాస్టిక్ సంచుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 5.7 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యమైనట్లు తెలిపారు. నిందితుడిపై 6ఏ కేసు నమోదు చేశామన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని భట్‌పల్లి చౌరస్తా వద్ద మంగళవారం 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. కాగజ్‌నగర్ పట్టణ ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా, దహెగాం వైపు నుంచి వస్తున్న బోలేరో వాహనాన్ని తనిఖీ చేయగా 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. కాగజ్‌నగర్‌కు చెందిన ఆరీఫ్, రాజేశ్‌లు దహెగాం మండలంలోని ఇట్యాల పరిసర ప్రాంతాల్లో బియ్యం సేకరించి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పట్టణ ఎస్సై అంజయ్య తెలిపారు.